క్లుప్తంగా

దిశ యాప్‌ను సద్వినియోగం చేసుకోండి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న దిశ డీఎస్పీ మురళీమోహన్

రామచంద్రపురం: ప్రభుత్వం మహిళల రక్షణకు తీసుకువచ్చిన దిశ యాప్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా దిశ విభాగం డీఎస్పీ సుంకర మురళీమోహన్ అన్నారు. పట్టణంలోని వీఎస్‌ఎం కళాశాలలో ఏర్పాటు చేసిన దిశ అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. దిశ చట్టం, దిశ యాప్ ద్వారా కలిగే ప్రయోజనాలు వినియోగంపై సూచనలను చేశారు. రామచంద్రపురం డీఎస్పీ టీఎస్‌ఆర్‌కే ప్రసాద్, సీఐ వి.దుర్గారావు, ఎస్సై డి.సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పలు వాహనాలు సీజ్ చేసిన ఎంవీఐ

రాయవరం: అనుమతి పత్రాలు లేకుండా రహదారులపై మట్టిని తరలిస్తున్న పలు వాహనాలను రామచంద్రపురం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్(ఎంవీఐ) రాజేంద్రప్రసాద్ సీజ్ చేశారు. మండలంలోని మాచవరం సెంటర్‌లో వాహనాల తనిఖీ చేపట్టిన ఎంవీఐ రాజేంద్రప్రసాద్ శనివారం విలేకరులతో మాట్లాడారు. రెండు రోజులుగా నిర్వహించిన తనిఖీల్లో మోటార్ వాహన చట్టం ప్రకారం త్రైమాసిక పన్నులు చెల్లించని, అనుమతి పత్రాలు, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్‌లు లేని వాహనదారులు, పరిమితికి మించిన వేగంతో వాహనాలను నడుపుతున్న వ్యక్తులపై జరిమానాలు విధించినట్టు వివరించారు. ఐదు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని వాటి యజమానులకు రూ.73 వేల జరిమానా విధించినట్లు తెలిపారు. రూ.40 వేలు జరిమానా చెల్లించిన వాహనాలను విడుదల చేసి, యజమానులకు తగు సూచనలతో అవగాహన కల్పించినట్లు ఆయన తెలిపారు. జరిమానా చెల్లించిన అనంతరం వాహనాలను యజమానులకు అప్పగించనున్నట్లు తెలిపారు. రామచంద్రపురం, కె.గంగవరం, రాయవరం, మండలాల్లో తరచుగా ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని, అనుమతి పత్రాలు లేకుండా తిరిగే భారీ, మధ్య, చిన్న తరహా వాహనాలపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

ప్రతిభావంతులకు ఉపకారం

- ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు విద్యాదాన్ స్కాలర్‌షిప్పులు
- దరఖాస్తుకు 15 వరకూ గడువు

రాయవరం: ప్రతిభావంతులకు గుర్తింపు ఎప్పుడూ ఉంటుంది. చదువులో అత్యుత్తమ ప్రతిభ చూపుతూ, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం సరోజిని దామోదరన్ ఫౌండేషన్ (ఎస్‌డీఎఫ్) ద్వారా 'విద్యాదాన్' ఉపకార వేతనం అందిస్తోంది. కళాశాల విద్యలో సత్తా చాటే వారికి ఇది ఒక వరంలా మారనుంది. కేంద్ర ప్రభుత్వం 2016లో ప్రవేశపెట్టిన ఈ పథకం ప్రస్తుతం మన రాష్ట్రంతో పాటు తెలంగాణ, ఒడిశా, కేరళ, తమిళనాడు, కర్ణాటక, గోవాల్లో అమలవుతోంది. ఇప్పటి వరకూ ఈ పథకం కింద 6,500 మంది లబ్ధి పొందారు. ఎంపికైన వారు ఫౌండేషన్ నుంచి రెండేళ్ల పాటు స్కాలర్‌షిప్ పొందవచ్చు. విద్యార్థి ప్రతిభ ఆధారంగా, నచ్చిన రంగంలో డిగ్రీ చదవడానికి స్కాలర్‌షిప్ ద్వారా ప్రోత్సాహం లభిస్తుంది. చదువుతున్న కోర్సు, కాలపరిమితి ఆధారంగా ఏడాదికి రూ.10 వేల నుంచి రూ.60 వేల వరకూ స్కాలర్‌షిప్ అందజేస్తారు. ఈ ప్రోగ్రామ్ ద్వారా ఎంపికైన విద్యార్థుల భవిష్యత్తుకు దిశా నిర్దేశం చేస్తారు.

ఇదీ అర్హత

విద్యాదాన్ ఉపకార వేతనం పొందడానికి విద్యార్థి కుటుంబ వార్షికాదాయం రూ.2 లక్షల లోపు ఉండాలి. 2022-23 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణులై, ఇంటర్మీడియెట్ చదువుతున్న వారు అర్హులు. పదో తరగతిలో కనీసం 90 శాతం మార్కులు లేదా 9 శాతం జీపీఏ సాధించి ఉండాలి. దివ్యాంగులైతే 75 శాతం మార్కులు లేదా 7.5 శాతం జీపీఏ సాధించాలి.



విద్యాదాన్ స్కాలర్‌షిప్ లోగో

ఎంపిక విధానం

చదువులో చూపిన ప్రతిభ, ధ్రువపత్రంలో తెలిపిన సమాచారం ఆధారంగా ఎంపిక చేస్తారు. దరఖాస్తుదారులకు ఆన్‌లైన్ పరీక్ష నిర్వహిస్తారు. వారికి ఈ-మెయిల్ ద్వారా సమాచారం తెలియజేస్తారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 20 నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

దరఖాస్తు చేసుకోవాలిలా..

విద్యాదాన్ ఉపకార వేతనానికి ఈ నెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలి. జూలై 2న ఆన్‌లైన్ పరీక్ష ఉంటుంది. దరఖాస్తుదారులు పదో తరగతి మార్కుల జాబితా, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, ఈ ఏడాది తీసుకున్న ఆదాయ ధ్రువపత్రం, చదువుతున్న కళాశాల వివరాలు పొందుపరచాలి. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే వారు వ్యక్తిగత ఈ-మెయిల్ కలిగి ఉండాలి. నెట్ సెంటర్ లేదా ఇతరుల ఈ-మెయిల్ ఐడీలను అనుమతించరు. భవిష్యత్తులో ఎస్‌డీఎఫ్ నుంచి ఎటువంటి సమాచారమైనా ఈ-మెయిల్ లేదా ఎస్‌ఎంఎస్ ద్వారా తెలియజేస్తారు. వివరాలకు సోమవారం నుంచి శనివారం మధ్య ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ 'విద్యాదాన్.ఆంధ్ర ఎస్‌డీ ఫౌండేషన్ @ఇండియా.కామ్'ను సంప్రదించాలి. లేదా 83677 51309, 89858 01326 నంబర్లకు మెసేజ్ లేదా వాట్సాప్ ద్వారా సంప్రదించాలి.



విద్యార్థులు

- విద్యార్థులు నేరుగా ప్లే స్టోర్‌లోని 'విద్యాదాన్' యాప్ ద్వారా లేదా 'విద్యాదాన్ వెబ్‌సైట్' డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.విద్యాదాన్.ఓఆర్‌జీలో ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చు.
- పదో తరగతి మార్కుల జాబితా ప్రకారం మీ పేరులో మొదటి పేరు ఎంటర్ చేయాలి. తర్వాత రెండో పేరు నమోదు చేయాలి. అనంతరం విద్యార్థి అడ్రస్ ఎంటర్ చేయాలి. తర్వాత 'అప్లై నౌ' ఆప్షన్ క్లిక్ చేస్తే అకౌంట్ యాక్టివేషన్‌కు సంబంధించిన లింక్ మీ ఈ-మెయిల్‌కు వస్తుంది. ఆ లింక్ క్లిక్ చేయగానే విద్యాదాన్ హోమ్ పేజిలో 'అకౌంట్ యాక్టివేటెడ్ ' అనే మెసేజ్ వస్తుంది. అనంతరం ఈ-మెయిల్ ఐడీ, విద్యాదాన్ పాస్‌వర్డ్ ద్వారా లాగిన్ అయి, స్టెప్-2లోకి వెళ్లాలి.
- లాగిన్ అయిన తర్వాత హెల్ప్‌పై క్లిక్ చేసి, సూచనలు చదివి, ఆ ప్రకారం అప్లికేషన్ పూర్తి చేసి, డాక్యుమెంట్లు అప్‌లోడ్ చేయాలి. అవసరమైతే ఎడిట్‌పై క్లిక్ చేసి, అప్లికేషన్ ఎడిట్ చేసుకోవచ్చు. వివరాలు ఎంటర్ చేసిన తర్వాత 'సబ్‌మిట్'పై క్లిక్ చేయాలి. 'సబ్‌మిషన్ సక్సెస్‌ఫుల్' అని వస్తుంది.
- డాక్యుమెంట్లు, పాస్‌పోర్టు సైజ్ ఫొటో అప్‌లోడ్ చేసిన తర్వాతే దరఖాస్తుకు ఆమోదం లభిస్తుంది.
- దరఖాస్తుదారులు ఎప్పటికప్పుడు ఈ-మెయిల్ చెక్ చేసుకోవాలి.

స్వచ్ఛమైన తాగునీరు అందించడమే ధ్యేయం

కె.గంగవరం: గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడమే ధ్యేయంగా పని చేశామని సర్పంచ్ నానాపరవు కళ్యాణి అన్నారు. మండలంలోని అముజూరులో శనివారం ప్రత్యేక పూజలు చేసి మోటార్ స్విచ్ ఆన్ చేసి తాగునీటి సరఫరాను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో ఇప్పటి వరకు చెరువు నీరు మాత్రమే ప్రభుత్వ కుళాయిల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామని బోర్ ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణకు వినతి అందించామన్నారు. ఆయన వెంటనే స్పందించి రూ.3 లక్షల మండల పరిషత్ నిధులు మంజూరు చేయించారని ఆయన ప్రత్యేక కృతజ్ఞతలని తెలిపారు. గ్రామ పెద్దలు నానాపరవు శ్రీనివాస్, పెంకే రవిచంద్ర, కార్యదర్శి సీతారామయ్యచౌదరి, వీఆర్వో పట్టాభిరామారావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రామారెడ్డి కుటుంబానికి అనపర్తి ఎమ్మెల్యే పరామర్శ



రామారెడ్డికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి, ఏఎంసీ చైర్మన్ కృష్ణారెడ్డి తదితరులు

మండపేట: మండపేటకు చెందిన ధాన్యం కమీషన్ వ్యాపారి గొలుగూరి కోదండ వెంకట రామారెడ్డి కుటుంబాన్ని శనివారం అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పరామర్శించారు. స్థానిక బ్యాంకు కాలనీకి చెందిన రామారెడ్డి ఇటీవల దారుణ హత్యకు గురైన విషయం విదితమే. తీవ్ర విషాదంలో మునిగిపోయిన భార్య శ్వేతనాగదేవి, కుటుంబ సభ్యులు మల్లిడి శ్రీనివాసరెడ్డి, విజయలక్ష్మి తదితరులను ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి పరామర్శించి తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. అనపర్తి ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు నల్లమిల్లి వెంకటకృష్ణారెడ్డి, ఎస్‌బీఎస్‌ఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ సత్తి బులిస్వామిరెడ్డి, పడాల తమ్మిరెడ్డి, మల్లిడి ఈశ్వరరెడ్డి, సత్తి వెంకటరెడ్డి, కొవ్వూరి వీర్రాఘవరెడ్డి, సత్తి వెంకటరెడ్డి, గొలుగూరి వెంకటరెడ్డి తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి మందిరం ఏర్పాటు

కపిలేశ్వరపురం: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు ప్రతి ఒక్కరి ఒక సామాజిక బాధ్యత అని కేదారిలంక సర్పంచ్ వీధి వెంకటరెడ్డి అన్నారు. కేదారిలంక ఎస్సీపేటలో దీర్ఘకాలంగా ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి నూతనంగా మందిరాన్ని నిర్మించారు. నిర్మాణానికి సర్పంచ్ వెంకటరెడ్డి రూ.2 లక్షలు ఆర్థిక చేయూతనందించారు. ఎంపీటీసీ యర్రంశెట్టి నాగేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ మద్దింశెట్టి దొరబాబు, ఉప సర్పంచ్ యర్రంశెట్టి సత్తిబాబు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పోలిశెట్టి గణేష్, దళితవాడ పెద్దలు పాల్గొన్నారు.

రామారెడ్డి హత్య అత్యంత క్రూరం

- నిందితులను కఠినంగా శిక్షించాలి
- మండపేటలో భారీ శాంతి ర్యాలీ



మండపేటలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న విజయ భాస్కరరెడ్డి, వెంకట కృష్ణారెడ్డి తదితరులు

మండపేట: పట్టణంలో ఇటీవల చోటుచేసుకున్న రామారెడ్డి హత్య అత్యంత క్రూరమని, మానవతా విలువలు మరచి ఆయన్ను అత్యంత కిరాతకంగా హత్యచేసిన వారిని కఠినంగా శిక్షించాలని పలువురు డిమాండ్ చేశారు. స్థానిక బ్యాంకు కాలనీకి చెందిన ధాన్యం కమీషన్ వ్యాపారి గొలుగూరి కోదండ వెంకట రామిరెడ్డిని పట్టణానికి చెందిన ఇరువురు అత్యంత కిరాతకంగా హత్యచేసి గోతిలో పూడ్చిపెట్టిన విషయం విదితమే. రామారెడ్డి హత్యను ఖండిస్తూ మండపేట పాడీ మర్చంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో పాటు మండపేట, అనపర్తి, రామవరం, కుతుకులూరు, పరిసర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున తరలి వచ్చిన ప్రజలు శనివారం రాత్రి పట్టణంలో కొవ్వొత్తులతో భారీఎత్తున శాంతి ర్యాలీ నిర్వహించారు. రామారెడ్డి చిత్రపటంతో బ్యాంకు కాలనీలోని ఆయన ఇంటి వద్ద నుంచి గొల్లలగుంట, మెయిన్ రోడ్డు, బస్టాండు, కలువపువ్వు సెంటర్, కేపీ రోడ్డు మీదుగా ర్యాలీ సాగింది. పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు నల్లమిల్లి విజయభాస్కరరెడ్డి మాట్లాడుతూ వివాద రహితుడైన రామారెడ్డిని అతి కిరాతకంగా హత్య చేయడం పట్టణ ప్రజలను ఒక్కసారిగా ఉలికిపాటుకు గురి చేసిందన్నారు. బంధువులు, మిత్రుల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కారాదని, రామారెడ్డి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ శాంతి ర్యాలీ నిర్వహించామన్నారు. జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు నల్లమిల్లి వెంకట కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ నల్లమిల్లి కాంతమ్మ, కర్రి శ్రీనివాసరెడ్డి, కర్రి రామచంద్రారెడ్డి, సత్తి వెంకటరెడ్డి, నల్లమిల్లి కనకసుందరరెడ్డి, ఎస్‌వీవీ సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

చిట్టీల పేరుతో ఘరానా మోసం

- అధిక వడ్డీ ఎర చూపి రూ.1.50 కోట్లకు కుచ్చుటోపీ
- పోలీసులకు ఫిర్యాదు
- ఎమ్మెల్యే కన్నబాబుకు గోడు చెప్పుకొన్న బాధితులు



ఎమ్మెల్యే కన్నబాబుకు గోడు చెప్పుకుంటున్న బాధితులు



ఆరోపణలు ఎదుర్కొంటున్న కామేశ్వరరావు

కరప: ఎంతో నమ్మకంతో చిట్టీలు వేస్తూ, ఆపై అధిక వడ్డీ ఎర వేసి రూ.1.50 కోట్లకు కుచ్చుటోపీ పెట్టిన ఓ వ్యాపారి పలాయనం చిత్తగించాడు. కరప మండలం వేములవాడలో ఈ సంఘటన చోటు చేసుకుంది. బాధితులు, కరప పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గండి కామేశ్వరరావు, అతడి కుమారుడు దుర్గరాజు చాలా కాలం నుంచి కిరాణా వ్యాపారం చేస్తున్నారు. తర్వాత చిట్టీల వ్యాపారం మొదలు పెట్టి, గ్రామస్తులకు నమ్మకం కలిగించారు. డ్వాక్రా మహిళలు, ఉపాధి కూలీలు, చిరు ఉద్యోగులు, రైతులకు అధిక వడ్డీ ఎర చూపించి, సొమ్ములు తీసుకునేవారు. చిట్టీలు పాడుకున్న వారి డబ్బులు కూడా వడ్డీ పేరుతో తనవద్దే ఉంచేసుకునేవారు. మధ్యమధ్యలో వడ్డీలు చెల్లించడంతో గ్రామస్తుల్లో నమ్మకం ఏర్పడింది. వేములవాడతో పాటు కరప, వేళంగి, జి.వేమవరం, రామచంద్రపురం గ్రామాలకు చెందిన వారి నుంచి రూ.1.50 కోట్లు సేకరించిన కామేశ్వరరావు కుటుంబ సభ్యులతో కలసి పలాయనం చిత్తగించాడు. కొంత కాలం నుంచి వారు కనిపించకపోవడంతో పని మీద ఊరికి వెళ్లి ఉంటారని గ్రామస్తులు భావించారు. పది రోజుల క్రితం కామేశ్వరరావు వచ్చి, గుట్టు చప్పుడు కాకుండా ఇంట్లోని సామాన్లు తీసుకుని వెళ్లిపోయాడు. మరో ఇంట్లో ఉన్న సామాన్లను అతడి కోడలు భవాని ఆటోలో తీసుకెళ్లిపోతుంటే అనుమానం వచ్చి, గ్రామస్తులు నిలదీశారు. దీంతో అసలు విషయం బయటపడింది. ఆమెను గ్రామస్తులు కరప పోలీసులకు అప్పగించారు. తీసుకున్న సొమ్ముల్ని వాయిదాల పద్ధతిలో తీరుస్తామని పెద్దల సమక్షంలో కాగితం రాసివ్వడంతో పోలీసులు వారిని వదిలేశారు. అనంతరం కామేశ్వరరావు కుటుంబ సభ్యులు గ్రామస్తుల కళ్లుగప్పి పారిపోయారు. ఈ నేపథ్యంలో తమకు న్యాయం చేయాలంటూ బాధితులు శనివారం కరప పోలీసులను ఆశ్రయించారు. అనంతరం కరప వచ్చిన ఎమ్మెల్యే కురసాల కన్నబాబును సర్పంచ్ కమిడి మంగాదేవి, శంకర్‌తో కలిసి తమ గోడు చెప్పుకొన్నారు. మోసగాళ్లను పట్టుకుని బాధితులకు న్యాయం చేయాలని కరప ఎస్సై ఎస్.రామకృష్ణను ఎమ్మెల్యే ఆదేశించారు. కామేశ్వరరావు మాయమాటలు నమ్మి రూ.14 లక్షలు ఇచ్చానని, చిట్టీల సొమ్ము రూ.5 లక్షలు రావాలని శ్రీపాద లక్ష్మి విలపిస్తూ తెలిపింది. ఎక్కువ వడ్డీ వస్తుందని తెలిసిన వారి నుంచి రూ.3 లక్షలు తీసుకుని కామేశ్వరరావుకు ఇచ్చానని, రూ.5 లక్షల వరకూ చిట్టీ సొమ్ము రావాలని మరో బాధితురాలు పడాల భవాని తెలిపింది.

చెత్త రహితంగా రామచంద్రపురం



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న మంత్రి వేణు

రామచంద్రపురం: పట్టణాన్ని గార్బేజ్ రహితంగా తీర్చిదిద్దడంలో భాగంగా చక్కటి డ్రైనేజీ వ్యవస్థను నెలకొల్పే విధంగా చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, బీసీ సంక్షేమం, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. మెయిన్‌రోడ్డులో ప్రధాన మురుగు కాలువల శుభ్రత పనులను మంత్రి వేణు శనివారం పరిశీలించారు. మంత్రి వేణు మాట్లాడుతూ స్వచ్ఛ రామచంద్రపురంలో భాగంగా పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రధాన డ్రైన్‌లు సరిగ్గా లేకపోవటంతో ఏటా వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాలు జలమయం అవుతున్న దృష్ట్యా దీని నివారణకు వీఎస్‌ఎం కళాశాల నుంచి మెయిన్ రోడ్డుకు ఇరు వైపులా గల డ్రైనేజీల్లో పేరుకుపోయిన పూడిక తీసే పనులు చేపట్టి సమస్య పరిష్కారం దిశగా చర్యలు తీసుకున్నామన్నారు. కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి, డీఈ డి.దుర్గాప్రసాద్, టీపీవో మణిరామ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ డేవిడ్‌రాజు పట్టణ వైఎస్సార్ సీపీ కన్వీనర్ గాధంశెట్టి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు నలుగురు విద్యార్థుల ఎంపిక

కాజులూరు: ఈ ఏడాది కాజులూరు మండల గ్రామాల నుంచి జాతీయ ప్రతిభా ఉపకార వేతనాలకు నలుగురు విద్యార్థులు ఎంపికైనట్టు మండల విద్యాశాఖాధికారి కేవీవీ సత్యనారాయణ తెలిపారు. శనివారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అయితపూడి జెడ్పీ స్కూల్ నుంచి మాసగిరి అభిషేక్, శీల జెడ్పీ స్కూల్ నుంచి ఆది రెడ్డి మాధురి, తణుకువాడ జెడ్పీ స్కూల్ నుంచి వాసంశెట్టి చరణ్‌దీప్తి, కాజులూరు జెడ్పీ స్కూల్ నుంచి సత్య లక్ష్మీదుర్గ ఉపకార వేతనాలకు ఎంపికయ్యారన్నారు. వీరికి సంవత్సరానికి రూ.12 వేలు చొప్పున నాలుగు ఉపకార వేతనాలు అందుతాయన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ ఫలితాల్లో 'మున్సిపల్ ' విద్యార్థుల ప్రతిభ

మండపేట: ఎన్‌ఎంఎంఎస్ ఫలితాల్లో మండపేట గౌతమి మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని హెచ్‌ఎం సీహెచ్ శోభావళి తెలిపారు. ఓపెన్ కేటగిరీలో వైష్ణవి జిల్లా 3వ ర్యాంకు సాధించగా దీక్షిత జిల్లా 6వ ర్యాంకు, ఉమెన్ కేటగిరీలో సిరిలక్ష్మి జిల్లా 1వ ర్యాంకు, ఎస్‌టీ ఉమెన్ కేటగిరీలో కె. సత్యప్రియ జిల్లా ఫస్ట్ ర్యాంకు సాధించారన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, పీఎంపీ కోఆప్షన్ సభ్యుడు యరమాటి వెంకన్నబాబు తదితరులు అభినందించారు.

నేడు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన

రామచంద్రపురం: పట్టణంలోని స్టీల్‌విల్‌పేటలో సీఎం అభివృద్ధి నిధుల నుంచి రూ.10 లక్షలతో నిర్మించే ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ శంకుస్థాపన చేయనున్నట్లు కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి శనివారం స్థానిక విలేకరులకు తెలిపారు. చైర్‌పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి నేతృత్వంలో జరిగే ఈ కార్యక్రమానికి కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

సీతమ్మతల్లికి పుస్తెలు



వెలంపేట రామాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

రాయవరం: స్థానిక వెలంపేట రామాలయంలోని సీతమ్మ అమ్మవారికి భక్తులు విరాళాలతో ఆభరణాలు సమకూర్చారు. స్థానిక వెలంపేటకు చెందిన మహిళా భక్తులు విరాళాలుగా సేకరించిన రూ.73 వేలతో వెండి తోరణాలు, సీతమ్మ తల్లికి బంగారు పుస్తెలు తయారు చేయించారు. వాటిని శనివారం ఆలయానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ నౌడు వెంకటరమణ, స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.